క్లుప్తంగా

త్రిమోతికి డాక్టరేట్



కమలాపూర్ : మండలంలోని దేశరాజుపల్లికి చెందిన దాసరి త్రిమోతి కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రో బయాలజీ విభాగంలో డాక్టరేట్ సాధించాడు. మైక్రోబయాలజీ విభాగ సూపర్‌వైజర్ డాక్టర్ ఎడ్ల సుజాత పర్యవేక్షణలో 'స్క్రీనింగ్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ లక్కాసెస్ ఫ్రం ఫంగల్ స్ట్రెయిన్స్‌ఫర్ బయో రెమిడీయేషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఎఫుల్యేయెంట్స్' అనే పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. త్రిమోతి ప్రస్తుతం కాకతీయ మెడికల్ కాలేజీ వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో సైంటిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

నర్సింహులపల్లిలో ఉచిత నేత్రవైద్య శిబిరం



శాయంపేట : మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలోని జీపీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ లయన్స్ క్లబ్ పరకాల ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆప్తాల్మిక్ డాక్టర్ జి. వెంకటనారాయణ 86 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి చూపు మందగించిన 18 మందిని ఉచిత శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ వెంకన్న, రాజేష్, ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ గ్రామ కార్యదర్శి వలుస తిరుపతి, ప్రజ్వల్ కంపెనీ ప్రతినిధులు పన్నాటి రాంబాబు, కుక్కల కల్పన, ధనలక్ష్మి, సాంబయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి శుక్రవారం రాత్రి పరిశీలించారు. డీసీపీ వెంట వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, క్రైం డీసీపీ విజయ్, స్థానికులు ఉన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

- పెరుగుతున్న నేరాలు
- నడిరోడ్డుపై రెండు వర్గాల ఘర్షణ
- రెండు నెలల్లో అన్నదమ్ముల ఇళ్లలో చోరీ

పరకాల: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుల తో సమానం. అలాంటి సీసీ కెమెరాల ఏర్పాట్ల కోసం మేము సైతం నినాదంతో ప్రజల భాగస్వామ్యం చేయడంలో పరకాల డివిజన్ పోలీసులు చూపించిన చొరవ జిల్లా, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను సైతం ఆకట్టుకుంది. సీసీ కెమెరాలతో అనేక మంది నేరస్తులను పట్టుకోవడంతో పాటు నేరాల నియంత్రణకు దోహదపడ్డాయని చెప్పుకోవచ్చు. నేడు సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో సంఘ విద్రోహ శక్తులు, దొంగలు, రోడ్ల వెంట సంచరించే పోకిరీల ఆగడాలు పెరిగిపోయాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పరకాల డివిజన్‌లోని శాయంపేట, పరకాల, ఆత్మకూరు, దామెర, నడికూడ మండలాల పరిధిలో మేముసైతం కార్యక్రమంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో 2949ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. నేడు ఆయా సీసీ కెమెరాల్లో సుమారు 1500లకు పైగా కెమెరాలు ఉరుములు, పిడుగులు, వర్షానికి షార్ట్ సర్క్యూట్ అయి నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేయించడం ఆర్థిక భారంగా మారడంతో పోలీసులు సైతం పెద్దగా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. సీసీ కెమెరాల ద్వారా ప్రయోజనాలను వివరిస్తూ పోలీసులు ప్రధాన రహదారుల వెంట ఉన్న ఒక్క వ్యాపారస్తుడి నుంచి రూ.1000 వసూలు చేశారు. హాయా కెమెరాలన్నింటిని కూడా పరకాల పోలీసు స్టేషన్‌లోని సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడంతో ఎలాంటి నేరం కానీ.. ప్రజలు విలువైన వస్తువులు పోగొట్టుకున్న చాలా సులువుగా కనిపెట్టి బాధితులకు అందజేసేవారు. అదే విధంగా దొంగతనాలు చేయాలనుకునే వారికి సీసీ కెమెరాలు వణుకు పుట్టేలా ఉంటాయి. సీసీ కెమెరాలు పనిచేయని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గత కొంత కాలంగా దొంగలు రెచ్చిపోతుండగా పోకిరిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రెండు వారాల క్రితం ఓ పెళ్లి బరాత్‌లో రెండు వర్గాలు నడిరోడ్డుపై ఘర్షణ పడటం చూసి స్థానికులు భయాభ్రాంతులకు గురయ్యారు. అదే విధంగా రెండు నెలల వ్యవధిలోనే ఇద్దరు అన్నదమ్ముల ఇళ్లలో చోరీకి పాల్పడి లక్షలాది రుపాయల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన సంచలనంగా మారింది. పట్టణంలో కొందరి పశువులు సైతం మాయం అయ్యాయి. ఇలాంటి ఘటనలు పెరిగిపోకుండా ఉండాలంటే సీసీ కెమెరాలకు మరమ్మతులు అవసరమని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటే నేరాలు అరికట్టవచ్చని కోరుతున్నారు.



పరకాల సీఎస్ఐ రోడ్డులో పనిచేయని సీసీ కెమెరా



పీఎస్‌లో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూం

పనిచేయని కెమెరాలను గుర్తిస్తాం



వాస్తవానికి సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ చాలా సాధ్యమవుతుంది. పనిచేయని కెమెరాలను గుర్తించాలని క్రింది స్థాయి అధికారులను ఆదేశిస్తాం. కాలనీల్లో పనిచేయని సీసీ కెమెరాలను సంబంధిత కమ్యూనిటీల నిర్వహకులు తక్షణమే మరమ్మతు చేయించాలని కోరతాం.

– కిషోర్‌కుమార్, ఏసీపీ పరకాల

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం

ఐనవోలు: బీఆర్‌ఎస్ నాయకుడు, స్వేరోస్ వ్యవస్థాపకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాయలో బహుజన సమాజం మగ్గొద్దని కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద మండల ఎస్సీ ఆధ్వర్యంలో స్వేరోస్ స్టూడెంట్ యూనియన్ నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ బహుజన నినాదంతో సబ్బండ వర్గాలను మోసం చేసి తన రాజకీయ స్వార్థం కోసం వాడుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద, అగ్రనాయకత్వం మీద ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసినా ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి కొత్తూరి సునీల్, మహిళ అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, నాయకులు బరిగెల భాస్కర్, కొత్తూరి మధుకర్, ఎండీ.రహీం బాష, బరిగెల బాబు, కొండేటి దిలీప్, ప్రతాప్, హరీష్, ఏలియా, మహేందర్, రమేష్, రాజారాం, అశోక్, ఆనందం, రమేష్, పరమేష్ పాల్గొన్నారు.



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యథేచ్ఛగా చెట్ల నరికివేత



వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో కలప వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హరితహారం పేరుతో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటి పెంచేందుకు కృషి చేస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. కలప అక్రమ వ్యాపారులు పెద్దపెద్ద చెట్లను నరికేస్తూ టింబర్ డిపోలకు తరలిస్తున్నారు. మండలంలో అక్రమ కలప వ్యాపారం జోరుగా జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా చెట్ల నరికివేతను అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తోటల పెంపకంపై దృష్టి సారించాలి

కమలాపూర్ : పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండలంలోని భీంపల్లిలో శుక్రవారం ఆయన ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. సన్న, చిన్నకారు రైతులకు వారి భూముల్లో పెంపకం కోసం ఉపాధి పథకం కింద మామిడి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు, మునగ, యూకలిప్టస్, టేకు, కొబ్బరి మొక్కలు పెంచుకోవచ్చన్నారు. విద్యుత్, నీటి సౌకర్యం కలిగి ఉన్న ఆసక్తి గల రైతులు సన్న, చిన్న కారు రైతు ధృవీకరణ పత్రం, ఉపాధి హామీ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జతపర్చిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు అందజేయాలన్నారు. పండ్ల తోటలు పెంపకం చేపట్టిన రైతులకు ఉపాధి హామీ పథకం నుంచి కూలీల ద్వారా గుంతలు తవ్వించి మొక్కలు నాటించడం జరుగుతుందని, మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారన్నారు. పండ్ల తోటలు పెరిగే వరకు ఆ భూముల్లో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. అంతకు ముందు స్థానికుల ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ కమలాపూర్‌లోని బస్టాండ్ ప్రాంతంలో నాలాలపై చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. నాలాలపై అక్రమ నిర్మాణాల కారణంగా మురుగంతా మురుగు కాలువల్లోనే పేరుకుపోతోందని, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకుడు గుంతల నిర్మాణం కోసం కన్నూరు, భీంపల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను పీఆర్ ఏఈ మధుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాల్లో ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ బాబు

450 ట్రాక్టర్ల మట్టి ఇసుక డంప్ సీజ్

ఐనవోలు: సుమారు 450 ట్రాక్టర్ల మట్టి ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై గైకడి అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నందనం రెవెన్యూ శివారులో మట్టితో కూడిన ఇసుక డంప్ నిల్వ ఉందని సమాచారం మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. బుర్ర రాజ్‌కుమార్ ఎలాంటి అనుమతులు లేకుండా లింగం రామచంద్రారెడ్డి పట్టా భూమిలో సుమారు 450 ట్రాక్టర్ల మట్టి ఇసుకను నిల్వ చేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించి సీజ్ చేశారు. మైనింగ్ నిబంధనల మేరకు సదరు వ్యక్తులకు జరిమానా విధించడంతో తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. దాడుల్లో తహసీల్దార్ విక్రమ్ కుమార్, మైనింగ్ రాయల్టీ ఇన్స్‌పెక్టర్ వి.చంద్రకళ, మైనింగ్ సర్వేయర్ ఏ.పూర్ణ, ఏఆర్ఐ మల్లయ్యలు పాల్గొన్నారు.



మట్టి ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న వివిధ శాఖల అధికారులు

పొగాకుకు దూరంగా ఉండాలి



ఎల్కతుర్తి : వంగరలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, పోలీసులు, గ్రామస్తులు

ఎల్కతుర్తి: పొగాకుకు దూరంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమదేవపల్లి మండలం వంగర పీహెచ్‌సీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పొగాకుతో కలిగే నష్టాలపై వైద్యసిబ్బంది, పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ పొగాకుతో కలిగే నష్టాలపై విద్యార్థి దశనుంచే పిల్లలకు తెలియజేయాలన్నారు. ధూమపానం మనిషి జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. జీవితంలో ఎప్పటికీ పొగాకు, ఇతర పొగాకు ఉత్పత్తులను వినియోగించమని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు తాగడంతో చాలా మంది అనారోగ్యం బారినపడి క్యాన్సర్ తదితర రోగాలతో మృత్యువాత పడుతున్నారని సూచించారు. గుట్కా తినడంతో మనిషిని పీల్చి పిప్పి చేస్తుందన్నారు. నేరుగా పీల్చే పొగ కంటే పొగాకును పీల్చిన వారి ఊపిరి తిత్తుల్లోకి చొచ్చుకుపోయి ఎక్కువ హాని కలిగిస్తదన్నారు. దీంతో దగ్గు, శ్వాసకోశ సంబంధ ఇన్ఫెక్షన్స్ సోకి ఆస్తమా, ఊపిరితిత్తుల పనితీరు దెబ్బతిని తరుచుగా ఇన్‌ఫెక్షన్ వస్తదన్నారు. దీంతో మనిషికి ప్రాణహాని తలపించే ప్రమాదం ఉందన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రుబీనా, డాక్టర్ రహమాన్, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, పోలీస్, వైద్యసిబ్బంది కెఎల్ఎన్ స్వామి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నడికూడ : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొగాకుతో కలిగే నష్టాలపై అవగాహన

నడికూడ: ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా మండలంలోని రాయపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ పొగాకు సంబంధిత పదార్థాలు సేవించడంతో పెద్దసంఖ్యలో ప్రజలు క్యాన్సర్ల బారిన పడుతున్నారు. పొగాకు వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎహెచ్‌సీ సిబ్బంది జాత, ఎల్జాబెత్, రాజ్‌కుమార్, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా విత్తన దుకాణాల తనిఖీ

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ టీం మండల కేంద్రంలోని విత్తన డీలర్ షాపులను శుక్రవారం ముమ్మరంగా తనిఖీ చేసింది. విత్తన స్టాక్‌రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే దుకాణాల్లోని స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఎలాంటి నకిలీ విత్తనాలు లభించలేదని టాస్క్‌ఫోర్స్ టీం సిబ్బంది సూచించారు. తహశీల్దార్ జగత్‌సింగ్, ఎస్సై గోదారి రాజ్‌కుమార్, ఏఓ రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఎవరైనా గడువు దాటిన విత్తనాలు, లూజ్ సంచుల్లోని విత్తనాలను అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి నష్టపరిచినట్లు తెలిస్తే జైలు శిక్షతో పాటు షాపులు సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని విత్తన షాపులను అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విత్తనస్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఓ అబ్జల్‌పాషా, ఏఎస్సై సంపత్, ఏఈవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరకాల: పరకాలలో అనుమానాస్పదంగా ఉన్న విత్తనాల షాపులను పోలీసులు, రెవెన్యూ అధి కారుల సహకారంతో పరకాల వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లతో పాటు స్టాక్‌ను పరిశీలించారు.వారి వెంట పరకాల తహసీల్దార్ భాస్కర్, సీఐ రవిరాజ్, ఏఓ శ్రీనివాస్ ఉన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మసాగర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల అధికారుల బృందం హెచ్చరించింది. మండల పరిధిలోని వివిధ సీడ్స్, ఫర్టిలైజర్ షాపులను మండల అధికారులు శుక్రవారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో విత్తనాల స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి షాపుల్లో ఉన్న విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. బ్లాక్ బోర్డుపై ఎప్పటికప్పుడు విత్తనాల వివరాలను నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా లూజ్ విత్తనాలు విక్రయించకూడదని, విత్తనాలు విక్రయించే సమయంలో రైతుకు తప్పకుండా రశీదు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించొద్దని తెలిపారు. పత్తి, ఇతర విత్తనాలు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. దీంతో పాటు ఒకే రకానికి చెందిన విత్తనాలను కొనుగోలు చేయమని రైతులను ప్రలోభాలకు గురిచేయకూడదని చెప్పారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ బి.సదానందం, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.పద్మ, సీఐ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు: ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ విక్రమ్‌కుమార్, అధికారులు

శాయంపేట : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యాజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ గంగాజమున అన్నారు. శుక్రవారం మండలంలోని శాయంపేట, ప్రగతి సింగారం, పెద్ద కోడెపాక గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, బిల్లు బుక్‌లను, లైసెన్సులను, విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు సంబంధించిన బిల్ లేదా రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన లైసెన్స్ కలిగినటువంటి డీలర్ దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పంట కాలం పూర్తయ్యేవరకు రశీదు రైతు దగ్గరే ఉంచుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ ఉందో గమనించాలని, గ్రామాల్లో లూస్, నకిలీ విత్తనాలు అమ్మినచో కొనకూడదని వెంటనే వ్యవసాయ శాఖకు తెలియపర్చాలన్నారు. ఏఓ గంగాజమున, తహసీల్దార్ సుభాషిణి, ఎస్సై ప్రమోద్‌కుమార్‌లను కలిపి మండల టాస్క్‌ఫోర్స్ టీమ్‌గా నియమించినట్లు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపినట్లు ఏవో తెలిపారు. తహసిల్దార్, ఎస్సై, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

విత్తన చట్టాలను అతిక్రమించకూడదు

ఐనవోలు: విత్తన చట్టాలను అనుసరించి నాణ్యమైన విత్తనాలు ఎంఆర్‌పీకే రైతుకు అందేలా విత్తన డీలర్లు దోహదపడాలని మండల వ్యవసాయ అధికారి అడప కవిత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కీర్తి, అన్నపూర్ణ విత్తన దుకాణాలను తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎస్‌హెచ్‌ఓ అనిల్‌కుమార్‌లతో కలిసి సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను క్షుణ్ణంగా పరిశీలించారు. పత్తి విత్తన ప్యాకెట్ రూ.864 కంటే అధికంగా విక్రయించకూడదన్నారు. అధికారులు మాట్లాడుతూ మార్కెట్‌లో చెలామణిలో ఉన్న అన్ని నాణ్యమైన బోల్‌గార్డ్ బీజీ-2 విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యాపారులు కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ ధరలకు విత్తనాలు అమ్మకూడదన్నారు. ఊరు పేరు లేని లూజ్ విత్తనాలు, దిగుబడి బాగా వస్తుందని లోకల్ కల్తీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాలు రైతులకు విక్రయించిన ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు అమ్మినట్లు ఫిర్యాదు వచ్చినా సదరు వ్యాపారులపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ లాంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని హెచ్చరించారు.



శాయంపేట : ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ గంగాజమున



పరకాల: స్టాక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు



ముల్కనూరులో విత్తనషాపులో స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు



ధర్మసాగర్ : షాపులో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు



ఎల్కతుర్తి : విత్తన డీలర్ షాపులను తనిఖీ చేస్తున్న మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ టీం

హనుమాన్ మాలధారుల పూజలు



ఆత్మకూరు: భద్రాచలం బయలుదేరుతున్న హనుమాన్ మాలధారులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి వేద మంత్రోచ్ఛరణలతో స్వాములకు ఆశీర్వచనాలు అందచేశారు. అనంతరం ఇరుముడితో భద్రాచలం తరలివెళ్లారు.

శాయంపేట : మండల కేంద్రంలోని పోచమ్మ గుడి ఆవరణలోని హనుమాన్ దేవాలయంలో శుక్రవారం హనుమాన్‌మాలధారులకు శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ అర్చకులు శ్రీకృష్ణమాచార్యులు ఇరుముడి ధారణ చేశారు. ముందుగా స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 53 మంది స్వాములకు అర్చకులు ఇరుముడి ధారణ చేశారు. పోచమ్మ, బొడ్రాయి దేవతలకు హనుమాన్ భక్తులు మొక్కులు చెల్లించుకుని భద్రాచలం, కొండగట్టు, ఇల్లంతకుంట, మల్లక్కపేటలో శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ మాల విరమణ కోసం వాహనాల్లో తరలివెళ్లారు. సురేష్, భాస్కర్ రెడ్డి, రవి, రవిపాల్ పాల్గొన్నారు.



శాయంపేట: ఇరుముడి కట్టుకోవడానికి గుడికి వెళ్తున్న హనుమాన్ మాలధారులు

16న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ నాయకులు

హన్మకొండ: భూమిని పంచు.. బడ్జెట్ పెంచు, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ ఈనెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జ తారకం) రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను సాంబయ్య తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులు, ప్రొఫెసర్లు హాజరయ్యే ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

హన్మకొండ: నేరాలు, అఘాయిత్యాలు, దాడుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వరంగల్ జిల్లా షీటీం ఎస్సై కంచి విద్యాసాగర్ సూచించారు. సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, అఘాయిత్యాలపై హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో శుక్రవారం అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో అమ్మాయిలు తమ వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆపద సమయంలో మహిళలు 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ సోమయ్య, గవర్నర్ వెంకటేశ్వర్ రావు, కోటేశ్వర్ రావు, కమలాకర్ విజయ కుమార్, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.